గీతం మెడికల్ కాలేజీలో విద్యార్థి ఆత్మహత్య

విశాలాంధ్ర - విశాఖ క్రైమ్: విశాఖలోని గీతం మెడికల్ కాలేజ్‌లో దారుణం చోటు చేసుకుంది. గీతం కళాశాలలో చదువుతున్న విద్యార్థి కాలేజీ బిల్డింగ్ ఆరవ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రం చంబా జిల్లాకు చెందిన విస్మద్ సింగ్(20)గా గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలికి చేరుకొని దర్యాప్తు చేపట్టి, మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విద్యార్థి కుటుంబ సభ్యులకు అధికారులు సమాచారం ఇచ్చారు. విద్యార్థి ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. గీతం కాలేజీలో జరిగిన ఘటనతో విద్యార్థులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.

ప్రభుత్వ కాలనీకి మౌలిక సదుపాయాలు కల్పించరూ..!

- మూడేళ్లు దాటినా పునాది వేయలేని పరిస్థితి
- విద్యుత్ సదుపాయం లేక నిరుపయోగంగా ఉన్న బోరు
- ప్రభుత్వం కేటాయించిన ఇళ్ల స్థలాల్లో పిచ్చి మొక్కలు

విద్యుత్ సదుపాయం లేక నిరుపయోగంగా బోరు

ప్రభుత్వం కేటాయించిన ఇళ్ల స్థలాల్లో మొలసిన పిచ్చి మొక్కలు

విశాలాంధ్ర - ఆనందపురం: గత ప్రభుత్వ హయాంలో లబ్ధిదారులకు అందించిన 72 చదరపు గజాలు స్థల విస్తీర్ణంలో ఇల్లు నిర్మాణాలు చేపట్టారు. మిగిలి ఉన్న కొన్ని గ్రామపంచాయతీలో కనీస వసతులు కూడా అధికారులు కల్పించలేకపోవడం వల్ల పునాది వేసుకోలేని పరిస్థితి ఉంది. కనీసం పనులు మొదలు కావాలంటే నీటి సదుపాయం రోడ్లు తప్పనిసరిగా కాలనీ వాసులకు ఏర్పాటు చేయాలి. సదుపాయం లేక ప్రభుత్వం అందించిన కాలనీ స్థలాలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఆగిపోయింది. ఆనందపురం మండలం బంటుపల్లి గ్రామపంచాయతీ లబ్ధిదారులకు అందించిన ప్రభుత్వ కాలనీకి బోరు ఏర్పాటు చేసినప్పటికీ విద్యుత్ సదుపాయం లేక లబ్ధిదారులు పనులు మొదలు పెట్టలేదు. దానితోపాటు ప్రధానంగా రోడ్డు సమస్య ఉందని లబ్ధిదారులు చెప్తున్నారు. స్థలం కేటాయించి సుమారుగా మూడు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఇంటి నిర్మాణాలు చేపడదాం అనుకున్న నిరుపేదలు సొంతింటి నిర్మాణం కలగానే మిగిలిపోయినట్లు ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం కేటాయించిన లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు మొదలుపెట్టడానికి సిద్ధంగా ఉన్నారు. కానీ నీరు, విద్యుత్ సదుపాయం లేక ముందుకు వెళ్ళలేకపోతున్నారు. వెంటనే సంబంధిత అధికారులు చొరవ తీసుకొని సదుపాయాలు ఏర్పాటు చేసినట్లయితే నిరుపేదలకు అందించే ఇంటి నిర్మాణాలు పూర్తిచేసుకుని వారి కలను సాకారం చేసుకోవడానికి అవకాశం ఉంటుందని స్థానికులు తెలిపారు.

సీఎం చంద్రబాబుకు ఘన స్వాగతం

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: విశాఖ జిల్లాలో పలు కార్యక్రమాల్లో పాల్గొనడానికి వాయుమార్గం ద్వారా బుధవారం ఉదయం విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉదయం 11 గంటలకు చేరుకున్నారు. నగరానికి చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రికి స్థానిక నేతలు, అధికారులు ఘన స్వాగతం పలికారు. బుధవారం ఉదయం విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి జిల్లా ఇన్చార్జి మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, ప్రభుత్వ విప్‌లు గణబాబు, వేపాడ చిరంజీవి రావు , శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు, వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేష్ బాబు, జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, వీఎమ్ఆర్డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, జీసీసీ ఎండి కల్పనా కుమారి, ఏపీ ఈపీడీసీఎల్ సిఎండి పృథ్వి తేజ్, డిసిసిబి చైర్మన్ కోన తాతారావు, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ ఎన్టీఆర్ వైద్య సేవ సీతంరాజు సుధాకర్, ఏపీ కోఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ చైర్మన్ గండి బాబ్జి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, ఇతర అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు.

జిమ్‌సర్ ఆధ్వర్యంలో జాతీయ ఔషధభద్రత వారోత్సవం

విశాలాంధ్ర - మధురవాడ: భారత ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబసంక్షేమ మంత్రిత్వ శాఖ పిలుపు మేరకు జాతీయ ఔషధ భద్రత పర్యవేక్షణ వారోత్సవాలను గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి (జిమ్‌సర్) ఫార్మకాలజీ విభాగం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమాన్ని జిమ్‌సర్ ప్రో-వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ బి.గీతాంజలి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిమ్‌సర్ డీన్ డాక్టర్ ఎస్.పి.రావు, ఫార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ తులసి మాధురి, ఫ్యాకల్టీ సభ్యులు డాక్టర్ ఎ.శ్యాంకుమార్, డాక్టర్ ఎన్.సింధూర, డాక్టర్ కె.వి.పూజిత, డాక్టర్ ఎ.కృష్ణసాయి, డాక్టర్ జి.వినీలా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఔషధాలను వినియోగించే సమయంలో ఏవైనా దుష్పరిణామాలు (సైడ్‌ఎఫెక్ట్స్) ముఖ్యంగా శరీరంపై దద్దురులు, కందరాలలో మంటలు, మూర్ఛపోవడం, నోటిలో పుండ్లువంటివి సంభవిస్తే వెంటనే సమీపంలోని వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ వారోత్సవాలలో భాగంగా జిమ్‌సర్ వైద్య విద్యార్థుల ఆధ్వర్యంలో భీమిలి సామాజిక వైద్య కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. కరపత్రాలను పంపిణీ చేశారు.

మెగా ఉచిత నేత్ర వైద్య శిబిరం

విశాలాంధ్ర - ఆనందపురం: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదినాన్ని పురస్కరించుకొని దుక్కవానిపాలెం గ్రామంలో ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఓఎస్‌జి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించిన శిబిరాన్ని ఆనందపురం మండల బిజెపి ఉపాధ్యక్షులు అడ్డూరి సురేష్ ప్రారంభించారు. 65 మంది రోగులు పరీక్షలకు హాజరయ్యారు. అందులో 15 మందిని ఆపరేషన్ల కోసం నాయుడు తోట శంకర్ ఫౌండేషన్‌కు తరలించగా, వారిని శస్త్రచికిత్స అనంతరం ఆదివారం తిరిగి దుక్కవానిపాలెంకు పంపిస్తామని క్యాంపు కోఆర్డినేటర్ వై.రాజు తెలిపారు. అవసరమైన వారికి కళ్లద్దాలు అందజేస్తూ, మరికొందరికి ఆసుపత్రి రిఫరెన్స్ కూడా ఇచ్చారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రెసిడెంట్ శివ దళాయి, మండల బిజెపి ఉపాధ్యక్షుడు అడ్డూరి సురేష్ మాట్లాడుతూ గ్రామ ప్రజలు శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారని, ఇటువంటి ప్రోత్సాహం లభిస్తే మరిన్ని వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి గ్రామాల అభ్యున్నతికి తమ వంతు సాయం చేస్తామని తెలిపారు.

విశాఖ పోర్ట్ అథారిటీలో స్వచ్ఛత పక్వాడ -2025

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: 2024-25 సంవత్సరానికి స్వచ్ఛత పక్వాడా అవార్డ్‌లో దేశంలో నంబర్ 1 పోర్ట్‌గా నిలిచిన విశాఖపట్నం పోర్ట్ అథారిటీ స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా కేంద్ర నౌక జల రవాణా మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు ఈ సంవత్సరం "స్వచ్ఛోత్సవ్" అనే థీమ్‌తో స్వచ్ఛత పఖ్వాడ 2025ను ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమం సంభమూర్తి ఆడిటోరియం, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్ బిల్డింగ్‌లో జరిగింది. ఈ సందర్భంగా దుర్గేష్ కుమార్ దుబే, ఉపాధ్యక్షుడు అన్ని విభాగాధిపతులు ఉద్యోగులతో కలిసి స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. అనంతరం, పరిసరాలలో ప్రత్యేక స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. ఇందులో అన్ని విభాగాల సిబ్బంది పాల్గొన్నారు. పాఠశాల విద్యార్థులకు పోటీలు నిర్వహించి, చిన్ననాటి నుంచే పరిశుభ్రత అలవాట్లను అలవరచేలా ప్రోత్సహిస్తున్నారు. సిబ్బంది, ప్రజా పరిష్కారాలు పెన్షన్స్ మంత్రిత్వ శాఖ ప్రారంభించిన పెండెన్సీ లేఖల నివారణ ప్రత్యేక కార్యక్రమంలో కూడా కట్టుదిట్టంగా చర్యలు తీసుకుంటోంది. ఎంపీలు రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధుల నుండి వచ్చిన లేఖల పరిష్కారం, అంతర మంత్రిత్వ శాఖ రిఫరెన్స్‌లు, పార్లమెంటరీ హామీలు, అభ్యర్థనలు/అపీల్స్, పాత రికార్డుల తొలగింపు, కార్యాలయ స్థలాన్ని సమర్థవంతంగా వినియోగించడం, స్క్రాప్ డిస్పోజల్ (దాని విలువతో సహా) తదితర అంశాలను ప్రాధాన్యతగా పరిష్కరిస్తోంది.

అర్థ రహిత సాంప్రదాయాల వ్యతిరేకి పెరియార్ ఇ.వి.రామసామి

భారత నాస్తిక సమాజం, పెరియార్ ఆశయ సాధన సంఘం ఆధ్వర్యంలో జయంతి

విశాలాంధ్ర - విశాఖ: నూతన యుగం ప్రవక్త, ఆగ్నేయ ఆసియా దేశాల సోక్రటీస్, సంఘ సంస్కరణ ఉద్యమానికి తండ్రి, అజ్ఞానానికీ, మూఢ నమ్మకాలకీ, అర్థరహిత సాంప్రదాయాలకీ, నీచమైన ఆచారాలకు బద్ధ శత్రువుగా యునెస్కో కొనియాడిన పెరియార్ ఇవి రామసామి దేశంలో 90 శాతంపైగా ఉన్న అణగారిన, వెనుకబడిన కులాల అభ్యున్నతికి జీవితాంతం కృషి చేశాడని రైటర్స్ అకాడమీ చైర్మన్, లీడర్ దినపత్రిక ఎడిటర్ రమణమూర్తి అన్నారు. పెరియార్ ఇవి రామసామి 147వ జయంతి కార్యక్రమం బీచ్ రోడ్డులో ఆయన విగ్రహం వద్ద భారత నాస్తిక సమాజం, పెరియార్ ఆశయ సాధన సంఘం నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేల సంవత్సరాలుగా మనిషుల మధ్య చిచ్చు పెడుతున్న అసమానతలను పెంచే కుల వ్యవస్థను నిర్మూలించాలని, కుల అసమానతలకు వ్యతిరేకంగా పెరియార్ పోరాటం చేశారని, మానవుల మధ్య అసమానతలకు కులం ఏవిధంగా కారణమైందో వివరిస్తూనే ఆ అసమానతల నుండి బయటపడడానికి నిర్విరామ కృషి చేశారని అన్నారు. భారత నాస్తిక సమాజం జాతీయ కన్వీనర్ జె.రవి మాట్లాడుతూ మహిళల స్వేచ్ఛ పట్ల పెరియార్ అభిప్రాయాలు విప్లవాత్మకమైనవని, మనం స్వేచ్ఛగా ఉండాలంటే స్త్రీలకు సమాన స్వేచ్ఛ ఇవ్వాలని అభిలాషించారని అన్నారు. భారత నాస్తిక సమాజం రాష్ట్ర నాయకులు టి.శ్రీరామమూర్తి మాట్లాడుతూ సాంఘిక, ఆర్థిక, రాజకీయ అణిచివేతల నుంచి పీడిత ప్రజల విముక్తికి పెరియార్ సాగించిన ఉద్యమం, చేపట్టిన సిద్ధాంతం విలక్షణమైనదని అన్నారు. సీపీఐ నాయకులు ఎం.పైడిరాజు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పెరియార్ విశేష కృషి చేశారని, స్త్రీ హక్కులకై ఉద్యమించిన నేత అని అన్నారు. ఈ కార్యక్రమంలో పెరియార్ ఆశయ సాధన సంఘం సెక్రటరీ పి.పెంటారావు, దళిత సేన నాయకులు గణపతి, న్యాయవాది సురేష్, భారత నాస్తిక సమాజం నాయకులు వై.నూకరాజు, సునీత, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

నిర్మలమ్మ సారథ్యంలో దేశ ఆర్థిక వ్యవస్థ గణనీయ పురోగతి

విశాలాంధ్ర - పెందుర్తి : కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సారథ్యంలో దేశ ఆర్థిక వ్యవస్థ గణనీయమైన పురోగతి సాధిస్తోందని బిజెపి బీసీ నేత మూల వెంకటరావు పేర్కొన్నారు. బుధవారం విశాఖ మధురవాడలో నిర్వహించిన గ్లోబల్ క్యాపబిలిటీ బిజినెస్ సమ్మేట్ లో పాల్గొనేందుకు, రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ తో కలిసి వచ్చిన సీతా రామన్ కు మూల వెంకటరావు ఘన స్వాగతం పలికారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జీఎస్టీ సంస్కరణల విజయంలో నిర్మలమ్మ పాత్ర ముఖ్యమైనదని స్పష్టం చేశారు. ఇటీవల చాలా వస్తువులను రెండవ క్యాడర్ స్లాబ్ లోకి తీసుకు రావడం ద్వారా అన్ని రకాల వస్తువులు ధరలు భారీగా తగ్గుతున్నాయని వెల్లడించారు. నిర్మలమ్మ చేపట్టిన జిఎస్టి వ్యవస్థను దేశ ప్రజలందరూ మనస్ఫూర్తిగా స్వాగతించారని తెలిపారు.

ఫార్మశీ ఆధ్వర్యంలో ఔషధాల వినియోగంపై అవగాహన

విశాలాంధ్ర - మధురవాడ: గీతం స్కూల్ ఆఫ్ ఫార్మశీ ఆధ్వర్యంలో జరిగిన మరో కార్యక్రమంలో ఆంధ్రవైద్య కళాశాల ఫార్మకాలజి విభాగం అధిపతి డాక్టర్ డి.శ్యామల ముఖ్యఅతిథిగా హాజరై ఔషధాలను వినియోగించే సమయంలో ఏవైనా దుష్పరిణామాలు ఎదురైనప్పుడు వాటిపై ఏవిధంగా ఔషధ విభాగం అధికారులకు తెలియ జేయాలో వివరించారు. ఎడ్వర్స్ డ్రగ్ రియాక్షన్ (ఎడిఆర్) నివేధికను తయారు చేయడంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆంధ్రవైద్య కళాశాల ఫార్మకాలజి విభాగం ప్రొఫెసర్‌లు డాక్టర్ ఎమ్.భీమేష్‌నాయుడు, డాక్టర్ ఎమ్.రచన, స్కూల్ ఆఫ్ ఫార్మశీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎల్.శ్రీనివాస్, నిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఎస్.స్వర్ణలత, ఫార్మశీ ప్రొఫెసర్‌లు డాక్టర్ పి.నరేశ్ డాక్టర్ ఆర్.బి.నలంద తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలకు బహుమతులు ఆందజేశారు.

ఘనంగా శ్రీ భగవాన్ విశ్వకర్మ జయంతి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: విశాఖపట్నం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో విశ్వకర్మ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ బీసీ సంఘాల నాయకులు, జిల్లా బీసీ సంక్షేమ శాఖ సిబ్బంది, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి భవానీ శంకర్, విశ్వకర్మ జిల్లా అధ్యక్షులు శివకోటి శ్రీనివాసరావు, బీసీ సెల్ అధ్యక్షులు పి. శివప్రసాద్, మహిళా విభాగం అధ్యక్షులు సీతామహాలక్ష్మి, బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శంకర్రావు తదితరులు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ విశ్వకర్మ మహర్షి భారతీయ సాంకేతిక విద్యకు, వాస్తుశాస్త్రానికి, శిల్పకళకు మార్గదర్శకుడని కొనియాడారు. ఈ సందర్భంగా బీసీ సంఘాల ప్రతినిధులు విశ్వకర్మ మహర్షి వారసత్వాన్ని కాపాడుకుంటూ యువతకు సాంకేతిక విద్య, నైపుణ్య అభివృద్ధి అవసరాన్ని ప్రాధాన్యంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.

మధురవాడ: శ్రీ భగవాన్ విశ్వకర్మ ఆలయంలో శ్రీ స్వామివారి జయంతి ఉత్సవాలు మధురవాడ శ్రీ విశ్వకర్మ భగవాన్ కార్పెంటర్ కళాకారుల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. జీవీఎంసీ మధురవాడ జోన్ 11లోని 5వ వార్డు, చైతన్య టెక్నో స్కూల్ ఎదురుగా గల విశ్వకర్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, అభిషేకాలు, దంపతులచే సామూహిక వ్రతాలు నిర్వహించారు. సింహతళాట సన్మానితులు శ్రీ లక్కోజు ఓంకార్ ఆచార్య సిద్ధాంతి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ సీనియర్ నాయకులు మొల్లి లక్ష్మణరావు, పిళ్ళా నర్సింగరావు, దాసరి శ్రీనివాస్, మన్యాల సోంబాబు, చెట్టిపల్లి గోపి, జనసేన సీనియర్ నాయకులు శేఖరి శ్రీనివాస్, వైసీపీ సీనియర్ గోవిందరావు, కొమ్మోజి చిన్న, గోలి సతీష్, కేశనకుర్తి కృష్ణాచారి, కలిగిట్ల సత్యనారాయణ, తాళాబత్తుల సత్తిబాబు, రామోజి పాండురంగ, వేముల ఈశ్వరరావు, మండా రమేష్, శంబాన గౌరి, కొత్తల శ్రీనువాస్‌రావు, కేశనకుర్తి అప్పలాచారి, రాయవలస అప్పలాచారి, తాడివాడ సత్తిబాబు, ఆవుపాటి శ్రీను, దమ్ము రాజు. సింహాద్రి రాజేష్ పాల్గొన్నారు. విశ్వకర్మ యజ్ఞాది మహోత్సవాలు విశ్వకర్మ సంఘం చైర్మన్ బ్రహ్మశ్రీ గిడిజాల పార్వతీశం, వైస్ చైర్మన్ బ్రహ్మశ్రీ శ్రీమంతుల వీరాచారి సూచనలతో భక్తజన రంజకంగా నిర్వహించారు.

పెదగంట్యాడ: శ్రీ గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వాములవారి ఆలయంలో విశ్వకర్మ జయంతి ఉత్సవాన్ని 75వ వార్డ్ కార్పొరేటర్ పులి లక్ష్మీ బాయి వెంకట రమణా రెడ్డి, వైసీపీ నాయకులు గొందేశి అప్పలరెడ్డి, దొమ్మేటి అప్పారావు, శ్రీమునిని శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్రహ్మ దేవుడు మానస పుత్రుడు విశ్వ ఖర్మ అని ఈ సృష్టికి మూలం అన్నారు. విశ్వకర్మ జయంతి రోజున పరిశ్రమలలో ఆయుధాలను కొన్ని రాష్ట్రాలలో పూజిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ముద్దుర్తి శ్రీరామమూర్తి, కణితి అప్పల రాజు, ముద్దుర్తి అప్పల రాజు, ద్వార్పుడి సత్యం, కొమ్మోజు మహేష్, హరి, ముద్దుర్తి శ్రీను, సాంబ రాము, గోర్స సురేశ్, పొడుగు ప్రసాద్, ముద్దుర్తి నరేష్, బసవ మూర్తి, వై.ప్రసాద్, హరీష్, చెల్లూరి సతీష్, కొమ్మోజు కిశోర్, గొర్స సూరి బాబు, పుట్టా కృష్ణ, వి.సూరిబాబు, పెదపాటి స్వామి తదితరులు పాల్గొన్నారు.

సింహాచలం: గ్రేటర్ విశాఖ 89వ వార్డు ఆదర్శనగర్‌లో శ్రీ విరాట్ విశ్వబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ పూజా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జనసేన పార్టీ నాయకులు బెహరా భాస్కరరావు హాజరయ్యారు. ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గునిశెట్టి శ్రీనివాసరావు, శ్రీ విరాట్ విశ్వబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు అలుగోలు లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు అంపావల్లి శంకర్రావు, కార్యదర్శి ఒమ్మి ఆదినారాయణ, పి.నర్సింగరావు, సంఘ సభ్యులు, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వయో వందన పథకం వినియోగించుకోండి

విశాలాంధ్ర - పద్మనాభం: భారత ప్రధాని నరేంద్ర మోడీ 76వ జన్మదినోత్సవం సందర్భంగా భారతీయ జనతా పార్టీ వైద్య విభాగం, గురుదేవా చారిటబుల్ ట్రస్ట్, రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్ట్, శ్రీ గాయత్రి వెల్ఫేర్ కల్చర్ అకాడమీ ఆధ్వర్యంలో స్థానిక గోస్తని హైస్కూల్ ఆవరణలో దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు, వీల్ చైర్లు, వినికిడి యంత్రాలు పంపిణీ చేశారు. ప్రభుత్వ వయో వృద్ధులు, దివ్యాంగులు సంక్షేమ శాఖ, అసిస్టెంట్ డైరెక్టర్ కె.కవిత మాట్లాడుతూ ప్రధాని మోడీ గత 11 సంవత్సరాల పైగా దివ్యాంగుల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. వయో వందన సీనియర్ సిటిజన్ కార్డులు అర్హులైన అందరూ అందుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ వైద్య విభాగ కన్వీనర్, పద్మనాభం మండల ఇన్‌చార్జ్ రూపాకుల రవికుమార్, మండల బీజేపీ అధ్యక్షురాలు టి.నాగమణి, నేతలు మచ్చ సోమేష్, సిరిపురపు వెంకట్రావు, హంస మహేష్, కలింగ పట్టపు అప్పన్న, చొప్ప కృష్ణ, మరగడ గౌరీ రెడ్డి, పలా భరత్ కుమార్, కె.శ్రీనివాస్, గురు దేవా చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు సవిత, సుకన్య, బర్ల బాలాజీ, రెల్లి గణేష్, మరగడ పవన్ పాల్గొన్నారు. మొత్తం 150 మంది దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ జరిగింది.

సీపీఐ నేత కె.సత్యాంజనేయ మాతృమూర్తికి ఘన నివాళులు

విశాలాంధ్ర - మల్కాపురం: సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కామ్రేడ్ కె.సత్యాంజనేయ మాతృమూర్తి కె.శుభమ్మకు బుధవారం పలువురు శ్రద్ధాంజలి ఘటించారు. ఆమె పెద్దకర్మను పద్మనాభనగర్ ఆర్ఆర్‌వి పురం గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ పార్టీ నాయకులతో పాటు అభిమానులు కూడా పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు.

స్వస్థ నారీ సశక్త పరివార్ అభియాన్ ఆరోగ్య శిబిరాన్ని మధ్య ప్రదేశ్ నుండి వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోదీ. విశాఖపట్నం ఏయూ కన్వెన్షన్ నుండి పాల్గొన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్య కుమార్ యాదవ్, ఇన్‌చార్జి మంత్రి బాల వీరాంజనేయ స్వామి, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొని ఈ సందర్భంగా ప్రధాని మోదీ సందేశాన్ని వీక్షించారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి చంద్రబాబు ప్రసంగించారు. (విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం)

నేడు విశాఖలో సీజీఆర్ఎఫ్ క్యాంపు కోర్టు

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: ఏపీఈపీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం విశాఖపట్నం జోన్-1 డివిజన్‌లో పెద్ద వాల్తేర్ సెక్షన్‌లో గురువారం సీజీఆర్ఎఫ్ క్యాంపు కోర్టు నిర్వహించనున్నట్లు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) చైర్ పర్సన్, విశ్రాంతి జడ్జి బి.సత్యనారాయణ పేర్కొన్నారు. పెద్ద వాల్తేర్ సెక్షన్ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు జరిగే మీటింగ్‌లో వినియోగదారులు నేరుగా పాల్గొని విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు, బిల్లుల సమస్యలు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, పేరుమార్పిడి, విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో జాప్యం, ట్రాన్స్ ఫార్మర్ల మార్పిడి, తదితర విద్యుత్ సంబంధిత సమస్యలపై ఫిర్యాదులను చైర్ పర్సన్, సీజీఆర్ఎఫ్ కమిటీకి తెలియజేయవచ్చన్నారు. అదేవిధంగా విశాఖపట్నం సీతమ్మధారలోని ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఉన్న సీజీఆర్ఎఫ్ కార్యాలయానికి కూడా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. విచారణ జరిపి తగిన న్యాయం చేస్తామని తెలిపారు. వినియోగదారులు విద్యుత్ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నంబర్ 1912ను సంప్రదించవచ్చని సూచించారు. ఈసదస్సులో సీజీఆర్ఎఫ్ కమిటీ సభ్యులు ఎస్.రాజాబాబు, ఎస్ సుబ్బారావు, ఎన్ మురళీకృష్ణ పాల్గొంటారు.

జైపూర్ కార్పొరేషన్‌ను సందర్శించిన జీవీఎంసీ మేయర్ బృందం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ కార్పొరేటర్ల బృందం అధ్యయన యాత్రలో భాగంగా బుధవారం జైపూర్ కార్పొరేషన్‌ను సందర్శించారని జీవీఎంసీ కార్యదర్శి బి.వి.రమణ తెలిపారు. ఈ సందర్భంగా జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాసరావు, కార్పొరేటర్ల బృందం జైపూర్ (రెడ్ సిటీ)ని సందర్శించి జైపూర్ అభివృద్ధి కార్యక్రమాలు వారసత్వ సంరక్షణ, ఘన - ద్రవ వ్యర్థాల నిర్వహణ, ప్రజాహిత పాలన వంటి అంశాలపై అధ్యయనం చేశారని అలాగే స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్ యొక్క ప్రణాళికలు పురాతన వారసత్వ భవనాల సంరక్షణ, సుస్థిర పట్టణ అభివృద్ధి మొదలైనవి అమలవుతున్న నూతన పద్ధతులను మేయర్ కార్పొరేటర్ల బృందం పరిశీలించారని జీవీఎంసీ కార్యదర్శి తెలిపారు. ఈ సందర్భంగా జైపూర్ నగర నిగమ్ మేయర్ సోనమ్ గుర్జార్, ఇంజనీర్ ఓమన్ కార్గ్ జీవీఎంసీ మేయర్ కార్పొరేటర్ల బృందానికి సాదర స్వాగతం పలికి జైపూర్ నగర అభివృద్ధితోపాటు సాధించిన ప్రగతిని వివరించి, విశాఖపట్నం జీవీఎంసీ సాధిస్తున్న స్వచ్ఛ సర్వేక్షన్‌లో ర్యాంకులు అన్ని నగరాలకు ఆదర్శంగా ఉంటున్నాయని, విశాఖ నగరం చాలా సుందరీకరణతో అందరినీ ఆకర్షించుకుంటుందని కొనియాడుతూ జ్ఞాపికను జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాసరావుకు జైపూర్ నగర్ నిగమ్ మేయర్ అందించారు.

మహారాజశ్రీ 3వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు : కాకినాడ
I.A. 1666/2024 in O.S. 72/2024
Between:
సానా సూర్యనారాయణ నాయుడు
...పిటీషనర్ / ప్లెయిన్‌టిఫ్
మరియు
టిట్టి వివేకనంద, వగైరాలు
...రెస్పాండెంట్లు / డిఫెండెంట్లు
R2/D2 : గుడ్రాల (టిట్టి) రేవతి, W/o. లేటు బాబ్జీరావు, గృహిణి, డో.నెం. 13-32-12, ప్రేయర్ హాల్‌కి ఎదురుగా, వందావీధి, భీమునిపట్నం, భీమునిపట్నము మండలం, విశాఖపట్నం జిల్లా.
R3/D3 : అడపాక రేణుకదేవి, W/o. వెంకట నరసింహారావు, గృహిణి, డో.నెం. 2-1-437/1, స్ట్రీట్ నెం.6, నల్లకుంట, హైదరాబాద్.
పై దావాలో మరియు పైన తెలిపిన పిటీషన్‌లో నూ మీరు 2వ రెస్పాండెంట్ / 2వ డిఫెండెంట్ మరియు 3వ రెస్పాండెంట్ / 3వ డిఫెండెంట్ అయ్యివున్నారు. శ్రీ కోర్టు వారి ద్వారా మీకు ఎన్నిసార్లు నోటీసులు మరియు సమన్లు పంపినను తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు. పైన తెలిపిన పిటీషన్ మరియు దావా ది. 24-09-2025వ సం॥ తేదీన వాయిదా అయ్యివున్నది. కావున పై తేదిన పైన తెలిపిన కోర్టులో మీరు హాజరై మీ అక్షేపణలు తెలియపరచుకోవలెను. లేనియెడల పై పిటీషన్ మరియు దావా మీ పరోక్షమున తీర్మానము చేయబడుననియు ఇందుమూలముగా తెలియజేయడమైనది.
|| By Court Order ||
కాకర వెంకటేశ్వరరావు, అడ్వకేట్
#12-1-40, జవహర్ వీధి, కాకినాడ.
Cell: 9848314081
కాకినాడ.
ది.17-09-2025

రెడ్డిపల్లి ఎస్‌బిఐ ఆధ్వర్యంలో బీమాపై అవగాహన

విశాలాంధ్ర - పద్మనాభం: మండలంలోని రెడ్డిపల్లి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు నేరెళ్లవలస గ్రామంలో ఎస్‌బిఐ ఖాతాదారులకు బీమాపై సైబర్ నేరాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. జూలై 1 నుండి సెప్టెంబర్ 30 వరకు గ్రామస్థాయి జన సురక్ష కార్యక్రమాలలో భాగంగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ డైరెక్టర్ ఏవో బషీర్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి సురక్ష భీమా యోజన, జీవనజ్యోతి భీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, ఈకేవైసీ, నామిని, సైబర్ క్రైమ్ లపై అవగాహన జన్ ధన్ ఖాతాల నవీకరణ దిశగా చర్యలు, గ్రామీణ ప్రాంతాలలో క్షేత్రస్థాయిలో ఎస్ బిఐ సేవలు వంటి అంశాలపై ఖాతాదారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో, ఎస్ బిఐ డిజీఎం రాహుల్ శంక్రిత్యా, ఆర్ఎం అభిషేక్ కుమార్, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ శ్రీనివాస్ ,సిఎమ్ ఎఫ్ఐ, ఎఫ్ ఐ మేనేజర్ వేణుగోపాల్ రాఘవేంద్ర , రెడ్డిపల్లి శాఖ మేనేజర్ వెంకటేష్,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

ఎమ్మెల్యే వెలగపూడికి వినతి పత్రం

విశాలాంధ్ర - విశాఖ సిటీ: భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యేలకు ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. అధ్యక్షులు కోట సత్తిబాబు నాయకులు ఎన్.సాయిబాబా, బోర రమణ, నాగేశ్వరరావు, నారాయణరావు, అప్పలరాజు, వాసు ఆధ్వర్యంలో తూర్పు ఎమ్మెల్యే వెలగపడి రామకృష్ణ బాబును కలిసి తమ గోడును తెలియజేశారు. వెల్ఫేర్ బోర్డులో పెండింగ్లో ఉన్న 50 వేల క్లెయిమ్‌లను వెంటనే పరిష్కరించి దరఖాస్తుదారులకు సొమ్ము చెల్లించాలని, కొత్త సభ్యుల నమోదు సరళతరం చేసి వారికి గుర్తింపు కార్డులు జారీ చేయాలన్నారు. పాత కార్డులను కూడా రెన్యువల్ చేయాలని, గత ప్రభుత్వం బోర్డు నుండి దారి మళ్లించిన నిధులను తిరిగి బోర్డుకు జమ చేయాలని, వెల్ఫేర్ బోర్డు పాలకమండలిలో కార్మిక ప్రతినిధుల కోటాలో ఎఐటియుసికి స్థానం కల్పించాలని కోరారు.

ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పాత బకాయిలు చెల్లించాలి

విశాలాంధ్ర - ఆనందపురం: ఉద్యోగ ఉపాధ్యాయులకు రావలసిన పాత బకాయిలను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని మరి ముఖ్యంగా సిపిఎస్ ఉద్యోగులకు రావాల్సిన పిఆర్సి డిఏ, ఏరియర్స్, ఈఎల్ఎస్ పెండింగ్లో ఉన్నాయని ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మెరుగైన పిఆర్సితో పాటు పాత బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం ఉపాధ్యాయుల్లో నిరాశ కలిగిందని ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్ అసోసియేషన్ విశాఖపట్నం జిల్లా టీచర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.కేశవరావు అన్నారు. ఉద్యోగులు న్యాయబద్ధమైన హక్కులను వాయిదా వేయడం తగదని ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని అన్ని బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

దేవీ నవరాత్రులకు ముహూర్తం రాట

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలం పాండ్రంగి పంచాయతీ పరిధిలో ఏనుగుపాలెం గ్రామంలో బుధవారం దేవీ నవరాత్రులు పురస్కరించుకొని గ్రామస్తులంతా ఏకమై దేవీ నవరాత్రుల ఉత్సవ కమిటీను ఏర్పాటు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు స్థానిక యువత మహిళలు అందరూ కలిసి దేవీ నవరాత్రులు చేయుటకు ముహూర్తం రాట వేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 22 నుండి జరగబోయే దేవీ నవరాత్రులు మహోత్సవానికి ముహూర్తం రాట వేసామని ప్రతిరోజు ప్రత్యేక పూజలు వ్రతాలు చేస్తామని 28వ తారీకు ఆదివారం మహా అన్నదాన కార్యక్రమం చేయనున్నట్లు తెలియజేశారు. అక్టోబరు మూడో తారీఖున దేవీ నవరాత్రుల అనుపు మహోత్సవ కార్యక్రమం జరుపబడునని ఉత్సవ కమిటీ, స్థానిక పెద్దలు, యువత, మహిళలు తెలియజేయడం జరిగింది.

ఆనందపురం: మండలంలో లోడగలవానిపాలెం గ్రామంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బుధవారం ముహూర్తపు రాట ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ లోడగల రాజేశ్వరి రమణ దంపతుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం దుర్గాదేవి నవరాత్రులను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ముందుగా ముహూర్త రాట వేసి ఏర్పాట్లు ప్రారంభించడం ఆనవాయితీగా కొనసాగుతోందని తెలిపారు.కార్యక్రమంలో లోడగల రమణ దంపతులు, బమ్మిడి తారక్, మాజీ ఎంపీటీసీ లోడగల వెంకటరావు, గొలగాని వెంకట అప్పారావు, లోడగల సురేష్ కుమార్, లోడగల అప్పల నాయుడు, లోడగల సన్యాసిరావు, ముద్దాడ సన్యాసిరావు, అలబోయిన రమణ, గొలగాని సాయి, నమ్మి శ్రీను, పోలిపిల్లి అప్పారావు, బూరి కనకరాజు, అలబోయిన రాము తదితరులు పాల్గొన్నారు.

సేవా పక్షోత్సవాలలో రక్తదానం చేసిన గొర్లె

విశాలాంధ్ర - పెందుర్తి: ప్రధాని నరేంద్ర మోడీ 75వ జన్మదిన వేడుకలు సందర్భంగా భారతీయ జనతా పార్టీ నాయకులు సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు సేవా పక్షోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పెందుర్తి నియోజకవర్గం లో ఆ పార్టీ అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి పెందుర్తి నియోజకవర్గం కన్వీనర్ గొర్లె రామునాయుడు ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పెందుర్తి మండల పరిషత్ కార్యాలయం ఆవరణను శుభ్రం చేశారు అలాగే గాంధీ అంబేద్కర్ విగ్రహాలను పరిశుభ్రం చేశారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనకాపల్లి ఎంపీ కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించి దాతలు నుండి పెద్ద ఎత్తున రక్తం సేకరించారు. ఈ సందర్భంగా రామానాయుడు మాట్లాడుతూ భారతదేశాన్ని అన్ని విధాల అగ్రగామిగా నిలిపిన ప్రధాని నరేంద్ర మోడీ సుదీర్ఘకాలం సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

జూనియర్ ఎన్టీఆర్ అభిమాని సంఘం టీమ్ తారక్ ట్రస్ట్ జోన్-1 నిర్వాహకుడిగా లెంక

విశాలాంధ్ర - ఆనందపురం: జూనియర్ ఎన్టీఆర్ అభిమాని సంఘం టీమ్ తారక్ ట్రస్ట్ జోన్-1 నిర్వాహకుడిగా ఆనందపురం మండలం మిందివానిపాలెం గ్రామానికి చెందిన లెంక సురేష్ నియమితులయ్యారు. ఆయనకు సంఘం తరపున నియామక పత్రం అందజేశారు. సందర్భంగా లెంక సురేష్ మాట్లాడుతూ విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలలో అభిమానులను సమన్వయం చేసుకుంటూ సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టనున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు జిల్లా కోఆర్డినేటర్‌గా పనిచేస్తూ పలు సేవా కార్యక్రమాలు నిర్వహించానని, ఇప్పుడు జోన్-1 నిర్వాహకుడిగా నియమించబడటం తనకు మరింత గౌరవం, బాధ్యత అని అన్నారు. అభిమానుల ఐక్యతతోనే సేవా కార్యక్రమాలు విజయవంతం అవుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ పదవి రావడానికి సహకరించిన సంఘం నాయకత్వానికి, సహచర అభిమానులకు కృతజ్ఞతలు తెలుపుతూ, సమాజంలో పేదవారికి, అవసరమైన వారికి అండగా నిలిచి టీమ్ తారక్ ట్రస్ట్ సేవా కార్యకలాపాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

8వ వేతన సంఘ కమిటీని ఏర్పాటు చేయాలి

- పాత పింఛన్ పథకాన్ని పునరుద్ధరించాలి
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఐ.ఎన్.సి. మజ్దూర్ సంఘ్ వినతి

విశాలాంధ్ర - విశాఖ : 8వ వేతన సంఘ కమిటీని ఏర్పాటు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఐ.ఎన్.సి. మజ్దూర్ సంఘ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం విశాఖ విచ్చేసిన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కు ఆ సంఘం నేతలు వినతి పత్రం అందజేశారు. బీఎంఎస్, బీపీఎంఎస్ అనుబంధ ఐ.ఎన్.సి. సంఘం గౌరవాధ్యక్షులు పైలా దేముడు నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎస్.రాజేష్, కోశాధికారి పి.సురేష్ తదితరులు మంత్రిని కలిసి పలు సమస్యల్ని విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది ఉద్యోగులు, పెన్షనర్ల తరపున తాము ఈ లేఖ అందజేశామన్నారు. పదేళ్లకోమారు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతభత్యాలు, ఇతర ప్రయోజనాల్ని సమీక్షించేందుకే వేతన సంఘ కమిటీని ఏర్పాటు చేయమని కోరుతున్నామన్నారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా ఉద్యోగుల జీతభత్యాలుండేలా చూడాలన్నారు. ఓల్డ్ పెన్షన్ స్కీం వల్ల ఉద్యోగులకు మరింత భద్రత ఉంటుందని లేఖలో స్పష్టం చేశామన్నారు. 2004లో ప్రవేశపెట్టిన ఎన్ పీ ఎస్ వల్ల ఉద్యోగుల భవిష్యత్తుపై అనిశ్చితి నెలకొందన్నారు. ఈ రెండు కీలక డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు.

స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో ఎంపీపీ

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలం రేవిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ శిభిరాన్ని మండల మెడికల్ ఆఫీసర్ కె.లీలా ప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా స్థానిక ఎంపీపీ కంటుబోతు రాంబాబు హాజరయ్యారు. ఎంపీపీ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన మహిళలు ఉన్న కుటుంబాలే బలమైన కుటుంబాలుగా అభివృద్ధిలోకి వస్తాయని తెలిపారు. మహిళా సాధికారత అంటే ఆర్థికంగా మాత్రమే బలంగా ఉంటే సరిపోదని, మహిళలు ఆరోగ్యంగా జీవించడం కూడా మహిళా సాధికారత కింద వస్తుందని తెలిపారు. ప్రభుత్వం మంచి కార్యక్రమాలు చేపడుతున్న ప్పటికీ ప్రజలు వాటిని వినియోగించుకోవడంలేదని ఎంపీపీ పేర్కొన్నారు. నైపుణ్యం కలిగిన వైద్యులు రేవిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉన్నప్పటికి, ప్రజలు చాలా వరకు ఆర్ఎంపీలు దగ్గర వైద్యం చేయించుకుంటున్నారని, అక్కడ పరిమితికి మించి మందులు ఇవ్వడం వలన కిడ్నీ సమస్యలు ఎక్కువ అవుతున్నాయని, ఇకనైనా ప్రజలందరిలో మార్పు వచ్చి మనకు అందుబాటులో ఉన్న నైపుణ్యం కలిగిన వైద్యుల దగ్గరికి వచ్చి చికిత్స చేయించుకోవాల్సిందిగా ఎంపీపీ సూచించారు. ఈ శిబిరానికి హాజరైన మండల ప్రత్యేక అధికారి జ్ఞానవేణి మాట్లాడుతూ సెప్టెంబర్ 17వ తేదీ నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు అన్ని పంచాయతీలలో ఈ యొక్క వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఇందులో మహిళలకు సంబంధించి అన్ని స్క్రీనింగ్ పరీక్షలు, రక్త పరీక్షలు ఉచితంగా చేయబడతాయని, ప్రజలందరూ కూడా వాటిని సద్వినియోగపరుచుకోవాలని కోరారు. ఆపరేషన్ సింధూర్‌లో కూడా మహిళలే ముఖ్య పాత్ర పోషించి దేశానికి గర్వకారణంగా నిలిచారని, అంత శక్తివంతమైన మహిళలుగా తయారవ్వాలంటే మహిళలందరూ కూడా తమ యొక్క ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆవాల గంగరాజు, కోన రమణ, రమేష్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రధాని నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - పెందుర్తి : భారతదేశ శక్తిసామర్థ్యాలను, భారతీయతలోని గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పి, భారతదేశాన్ని విశ్వగురువుగా నిలిపేందుకు నిరంతరం కృషి చేస్తున్న భారత ప్రధాని నరేంద్ర మోడీ 75వ జన్మదిన వేడుకలు జీవిఎంసీ 95వ వార్డులో మంగళవారం ఘనంగా జరిగాయి. బిజెపి 95, 97వ వార్డుల అధ్యక్షులు చిక్కాల సతీష్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. బిజెపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి పెందుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం బర్తడే కేక్ కట్ చేసి ప్రధాని నరేంద్ర మోడీకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు.

కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి గొర్లి రామునాయుడు, సియ్యాద్రి బాలచంద్ర, శివ, సన్యాసిరావు, బీజేవైఎం విశాఖ జిల్లా ట్రెజరర్ గౌరీ కుమారి, బిజెపి 95,97వ వార్డుల సోషల్ మీడియా కన్వీనర్ కంచిబోయిన వెంకట సంతోష్, ఉపాధ్యక్షులు పిడివి ప్రసాద్, కెవిఆర్,కె.మాధవి, కెవిఆర్.లక్ష్మి, జనరల్ సెక్రెటరీ రాపర్తి దుర్గాప్రసాద్, సెక్రటరీ కొత్తపల్లి అప్పలరాజు, భవాని, మణి,తదితరులు పాల్గొన్నారు.

అలుపెరగని ప్రజా సేవకుడు ప్రధాని నరేంద్ర మోదీ

విశాలాంధ్ర తగరపువలస: నాలుగు దశబ్దాల రాజకీయ జీవితంలో అలుపెరగని ప్రజా సేవకే తన జీవితాన్ని దారాదత్తం చేసిన అసంఘటిత నాయకుడు దేశ ప్రధాని నరేంద్ర మోదీ అని ఉత్తరాంధ్ర నరేంద్ర మోదీ సేవాసంఘం కన్వీనర్ వాయునందన రావు అన్నారు. నరేంద్ర మోదీ 75వ జన్మదినాన్ని పురష్కరించుకొని భీమిలి జోన్ 3వ డివిజన్ కూటమి (టిడిపి, బిజెపి, జనసేన) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమం సందర్భంగా భీమిలి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వాయునందనరావు మాట్లాడుతూ నాలుగు దశబ్దాల రాజకీయ జీవితంలో 13 ఏళ్ళు గుజరాత్ ముఖ్యమంత్రిగా, 11 ఏళ్ళు దేశ ప్రధానిగా ఎన్నో సేవలు చేసి, ఎన్నో ప్రశంశలు పొందిన గొప్ప దార్శనికుడు నరేంద్ర మోదీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో భీమిలి ప్రభుత్వ ఆసుపత్రి సూపరెంటెండెంట్ డా. ఫణికుమార్, విశ్వ హిందూ పరిషత్ నుండి పూడిపెద్ద శర్మ, స్థానిక లాయర్ మంజుల, తెలుగుదేశం పార్టీ నాయకులు కాసరపు నాగరాజు, మారోజు సంజీవ్ కుమార్, వాడమొదలు సత్యారావు, కొక్కిరి అప్పన్న, కంటుబుక్త శ్రీనివాసరావు మాస్టర్, బిజెపి నాయకులు పల్లా భరత్ కుమార్, ఎమ్. రామకృష్ణ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మన డబ్బులు - మన లెక్కలు యాప్‌తో సభ్యుల లెక్కలు భద్రం

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సంఘ సభ్యులు ర్యాలీ నిర్వహిస్తూ "సంఘం మనదే - డబ్బు మనదే, విజయం మనదే లెక్కలు మనవే" అంటూ నినాదాలు చేశారు. సమావేశంలో జిల్లా ప్రాజెక్టు అధికారి వైదేహి మన డబ్బులు - మన లెక్కలు యాప్ ప్రాధాన్యతను వివరించారు. ఈ యాప్ ద్వారా ప్రతి సభ్యురాలు తమ పొదుపులు, అప్పులు, చెల్లింపులు వంటి వివరాలను సులభంగా తెలుసుకోవచ్చని తెలిపారు. వాయిస్ రికార్డింగ్ రూపంలో కూడా ఈ వివరాలు అందుబాటులో ఉంటాయని లైవ్ డెమో చూపించారు. అలాగే గత ఏడాది సాధించిన ప్రగతిని సమీక్షించి, రాబోయే సంవత్సరానికి సంబంధించిన వార్షిక ప్రణాళికను సభలో ఆమోదించారు. మహిళా సంఘాల నిర్వహణ, జీవనోపాధి అవకాశాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, జెండర్ సమానత్వం, ఎంసిపి వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిపిఎం వైదేహి, డిపిఎం (ఎల్ హెచ్)సత్యం నాయుడు, ఏపిఎం (హెల్త్) రేణుక, మండల ఏపిఎం ఎస్తేరు రాణి, ఎఫ్‌పిఓ ప్రభ పాల్గొన్నారు.

ఎస్బీఐ మ్యూచువల్ ఫండ్ ఆధ్వర్యంలో పెట్టుబడులపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - విశాఖపట్నం: కేవలం విద్యతోనే కాకుండా యువతరం ఆర్థిక అక్షరాస్యత పట్ల అవగాహన పెంచుకొని భవిష్యత్తు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని పలువురు ఆర్థిక రంగ నిపుణులు సూచించారు. ఈ మేరకు గురువారం అసోసియేషన్ ఆఫ్ మ్యూమవల్ ఫండ్స్ ఇన్ ఇండియా (ఏఎంఎఫ్ఐ) సహకారంతో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మ్యూచువల్ ఫండ్ (ఎస్ బీఐ ఎం ఎఫ్) ఆధ్వర్యంలో జరిగిన జరిగిన అవగాహన సదస్సులో వారు మాట్లాడుతూ చిన్న పట్టణాలు నుంచి ప్రజలు పెద్ద పెట్టుబడిదారులు గా మారడం శు భదాయకమన్నారు. మ్యూచువల్ ఫండ్ ఫోలియో పెరుగుదలకు శక్తిని అందిస్తున్న ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలు ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ ద్వారా పెట్టుబడిదారుల విద్య, అవగాహన కార్యక్రమం ప్రజల్లో ఆర్థిక అక్షరాస్యత పెంచడానికి దోహద పడుతుందన్నారు. పొదుపు మొత్తాల ఆర్థికీకరణ పెరగడంతో భారతదేశంలో పెట్టుబడుల స్వరూపం గణనీయమైన పరివర్తనకు గురైందన్నారు. సాంప్రదాయ పెట్టుబడుల నుంచి ఆధునిక ఆర్థిక సాధనాల వరకు, మూలధన మార్కెట్లలో పాల్గొనడం ద్వారా సంపద సృష్టించుకోవాలని కోరుకునే పెట్టుబడిదారుల తీరులో ఒక సమూల మార్పు వచ్చిందన్నారు.

అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (ఏఎమ్ఎఫ్ఐ) ప్రకారం జూలై 2025 నాటికి మ్యూచువల్ ఫండ్ పరిశ్రమ నిర్వహణలో ఉన్న మొత్తం ఆస్తులలో (ఏయూఎం) బీ30 ప్రదేశాలు 18 శాతం వాటా కలిగి ఉన్నాయని, ఈ ప్రాంతాల నుంచి ఏయూఎం జూన్ 2025లో రూ. 13.80 లక్షల కోట్ల నుంచి జూలై 2025లో రూ.14.20 లక్షల కోట్లకు పెరిగి నెలవారీ వృద్ధి 3 శాతం తో జూలై 2024తో పోల్చితే రూ. 11.77 లక్షల కోట్ల నుంచి 21 శాతం బలమైన వార్షిక వృద్ధిని సూచిస్తుందన్నారు.

ఆన్లైన్ మోసాలు అదుపు చేయడానికి 14సీతో ఒప్పందం

విశాలాంధ్ర - విశాఖపట్నం: రానున్న పండగ సీజన్ నేపథ్యంలో ఆన్లైన్లో ఉత్తేజభరితమైన డీల్స్, భారీ ఎంపికలు, మరియు అంతులేని షాపింగ్ అవకాశాలను తెచ్చింది. అదే విధంగా, నకిలీ ఆఫర్లు మరియు తప్పుదారి పట్టించే మెసేజ్ లు కూడా ప్లాట్ ఫాంలలో పంపిణీ అవుతున్నాయని కస్టమర్లు ఆత్మవిశ్వాసంతో కొనుగోళ్లు చేయడానికి, తమ ఆన్ లైన్ కొనుగోళ్ల అనుభవాన్ని పాడుచేసే కొద్దిమంది చెడు చేసే వారి నుండి తమను తాము కాపాడుకొని మరియు అప్రమత్తంగా ఉండవలసిందిగా అమెజాన్ పబ్లిక్ రిలేషన్స్ కమ్యూనికేషన్స్ విభాగ డైరెక్టర్ అశ్విని సమ్రాజ్ తెలిపారు. ఈ మేరకు హోం వ్యవహారాల శాఖ ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (14సీ)తో అమెజాన్ సంస్థ భాగస్వామ్యం చేసుకుందన్నారు. ప్రత్యేకమైన పండగ డీల్", "అత్యవసరంగా అకౌంట్ ధృవీకరణ", లేదా అమెజాన్ నుండి వచ్చినట్లుగా వివరించే అనుమానస్పద లింక్ లేదా ఏదైనా ఇతర షాపింగ్ వెబ్ సైట్ గురించి మెసేజ్ లను క్లిక్ చేయడానికి, భాగస్వామ్యం చేయడానికి లేదా చెల్లించడానికి ముందు జాగ్రత్తగా ఉండవలసిందిగా కోరారు. 2023లో అంతర్జాతీయంగా మా కస్టమర్లు నివేదించిన అమోజాన్ గా మోసగించిన మోసాలలో మూడింట రెండు వంతులు నకిలీ " ఆర్డర్" లేదా " ఖాతా" సమస్యలను కలిగి ఉన్నాయి. మారవేషంతో చేసే మోసాలు అమెజాన్ మార్కెట్ ప్రదేశం బయట ఇమెయిల్, టెక్ట్స్, మెసేజింగ్ యాప్స్, లేదా ఫోన్ కాల్స్ ద్వారా ప్రారంభమయ్యాయి.

మేక్‌మైట్రిప్ రైలు ప్రయాణాల్లోనూ జొమాటో సేవలు

విశాలాంధ్ర - విశాఖపట్నం: భారతదేశ ప్రముఖ ఆన్‌లైన్ ట్రావెల్ కంపెనీ, మేక్‌మైట్రిప్, భారతదేశపు ఫుడ్ ఆర్డరింగ్, డెలివరీ ప్లాట్‌ఫామ్ అయిన జొమాటోతో చేతులు కలిపి, రైలు ప్రయాణీకులకు వారి సీట్లకు నేరుగా భోజనాన్ని డెలివరీ చేసే సౌలభ్యాన్ని అందించింది. మేక్‌మైట్రిప్ యాప్ లో రైలు టిక్కెట్లను బుక్ చేసుకునే ప్రయాణి కులు ఇప్పుడు 130 కి పైగా స్టేషన్లలో జొమాటోలో జాబితా చేయబడిన 40,000 కి పైగా రెస్టారెంట్ భాగస్వాముల నుండి ఆహారాన్ని ఆర్డర్ చేయవచ్చు. ఈ అవకాశం చాలా ముఖ్యమైనది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో, ప్రతిరోజూ 90,000 కంటే ఎక్కువ మంది రైలు ప్రయాణికులు ఇండియన్ రైల్వేస్ ఇ-క్యాటరింగ్ సేవలను ఉపయోగించారు. ఇది సంవత్సరానికి 66 శాతం వృద్ధి ని నమోదు చేసింది. మేక్‌మైట్రిప్ తన 'ఫుడ్ ఆన్ ట్రైన్' ఆఫర్ ద్వారా ఈ డిమాండ్‌ను ఉప యోగించుకోడానికి సిద్ధంగా ఉంది. అల్పా హారం, భోజనం, రాత్రి భోజనం, క్విక్ స్నాక్స్ వం టి వాటిని తన ప్రొప్రై టరీ 'లైవ్ ట్రైన్ స్టేటస్' సాధనాన్ని ఉపయోగించడం ద్వారా, ప్రయాణి కులను అత్యంత అనుకూలమైన సమయం లో ఆర్డర్లు ఇవ్వడాన్ని ప్రోత్సహించడానికి ప్లాట్ ఫామ్‌కు వీలు కల్పిస్తుందని మేక్‌మైట్రిప్ బిజినెస్ ఆఫీసర్ తెలిపారు.

కొల్లి వెంకటరమణకు ఘన నివాళులు

పాల్గొన్న దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: 39వ వార్డు లక్ష్మీ టాకీస్ వద్ద కనకమహాలక్ష్మి దేవస్థానం మాజీ చైర్పర్సన్, జనసేన పార్టీ మహిళా నేత కొల్లి సింహాచలం భర్త కొల్లి వెంకటరమణ ఇటీవల స్వర్గస్తులైన నేపథ్యంలో బుధవారం ఏర్పాటు చేసిన సెరిమనీ కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీ పాల్గొని వెంకటరమణ చిత్రపటానికి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, డాక్టర్ జహీర్ అహ్మద్‌తోపాటు పలువురు వైసిపి నేతలు, మాజీ కార్పొరేటర్లు వెంకటరమణ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహిళ నేత కొన్ని సింహాచలంకు పలువురు రాజకీయ నాయకుల నేతలు, అధికారులు, పార్టీ కార్యకర్తలు, వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమెకు సానుభూతిని తెలియజేశారు.

రేపు మధురవాడలో విద్యుత్ ఉండని ప్రాంతాలు

విశాలాంధ్ర - మధురవాడ: 19 శుక్రవారం ఉదయం 9.00 నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు మధురవాడ సబ్ స్టేషన్ పరిధిలో గల 11కెవి చంద్రంపాలెం, 11కెవి నగరం పాలెం ఫీడర్ల పై మరమ్మత్తుల కారణంగా విద్యుత్ సరఫరా నిలుపుదల చేయటం జరుగుతుందని మధురవాడ సబ్‌స్టేషన్ ఇ.ఇ.సింహాచలం నాయుడు తెలిపారు. చంద్రంపాలెం, మధురవాడ మెయిన్ రోడ్,దుర్గ నగర్-1, దుర్గ నగర్-2,కృష్ణ నగర్,పోర్ట్ కాలనీ,గణేష్ నగర్,పోర్ట్ కోలనీ, కళ నగర్,బొట్టవానిపాలెం, స్వతంత్రనగర్,డాక్ యార్డ్ కోలనీ,శ్రీనివాస్ నగర్,నగరం పాలెంలో విద్యుత్ ఉండదన్నారు.

జీవీఎంసీలో ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: వాస్తు శిల్పి విశ్వకర్మ జయంతి వేడుకలు జీవీఎంసీలో ఘనంగా నిర్వహించడం జరిగిందని జీవీఎంసీ అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి పేర్కొన్నారు. బుధవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో విశ్వకర్మ జయంతి వేడుకలను జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్.ఎస్.వర్మ, వ్యయ పరిశీలకులు సి.వాసుదేవరెడ్డిలతో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్లు ఇరువురు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జీవీఎంసీ లోని వాస్తుశిల్పి విశ్వకర్మ జయంతి వేడుకలను నిర్వహించామని తెలిపారు. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 17న విశ్వకర్మ పూజ హిందువులు ఘనంగా నిర్వహిస్తారని పేర్కొన్నారు. బ్రహ్మకుమారుడే విశ్వకర్మ అని, ఆయన ప్రపంచ సృష్టికర్తగా కీర్తింపబడ్డాడని పేర్కొన్నారు. శ్రీకృష్ణుడు పరిపాలించిన ద్వారకా నగరాన్ని, పాండవుల కోసం ఇంద్రప్రస్థ రాజభవనంతో పాటు దేవతలకు అనేక అద్భుతమైన ఆయుధాలను తయారు చేశారని, ఆయనను దివ్య వడ్రంగి అని కూడా పిలుస్తారని అదనపు కమిషనర్లు పేర్కొన్నారు.